క్లుప్తంగా

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

గోకవరం: గోకవరం మండలంలో 14 పంచాయతీల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చేతుల మీదుగా పంపిణీ చేస్తామని ఎంపీపీ సుంకర శ్రీవల్లి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 312 పింఛన్లు మంజూరయ్యాయని, వీటిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

అర్హులందరికీ పింఛన్ల మంజూరు



పింఛన్లు పంపిణీ చేస్తున్న కామరాజు చౌదరి

పెదపూడి: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని పెదపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ మార్ని కామరాజు చౌదరి అన్నారు. పెదపూడి పంచాయతీ వద్ద మంగళవారం నూతనంగా మంజూరైన 74 పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హుల ముంగిటకే పథకాలు చేరుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచి కలవల కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసు చౌదరి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాకర సాయిబాబు, కోరా వీర్రాజు చౌదరి, పార్టీ మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

అనపర్తి: మండలంలోని రామవరం, దుప్పలపూడి, పీరా రామచంద్రపురం, కొప్పవరం, పొలమూరు, అనపర్తి గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 13 గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. అనపర్తి పరిధిలో ఖాళీగా ఉన్న ఆరు పోస్టులను ఓసీ 1 (మహిళ), ఎస్సీ 3 (మహిళ), బీసీ 2 (మహిళ), రామవరం గ్రామంలో బీసీ 1 (పురుష), దుప్పలపూడి బీసీ 1 (మహిళ), పీరారామచంద్రపురంలో ఎస్సీ 1 (పురుష), కొప్పవరంలో 2 ఓసీ (మహిళ), బీసీ 1 (పురుష), పొలమూరులో బీసీ 1 (మహిళ)కు కేటాయించామన్నారు. అర్హత, ఆసక్తి కల విద్యార్థులు ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలు లోగా ఆన్‌లైన్‌లో *http://20.204.146.16/APVOLUNTEER-Q20/-* వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ కాపీని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలన్నారు.

9న బైక్ ర్యాలీ

సీతానగరం: జిల్లా వ్యాప్తంగా ఉన్న సీలింగ్, లంక భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9వ తేదీన బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

ప్రత్యేక పూజలు

బిక్కవోలు: గ్రామంలోని శ్రీ కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం బహుళ షష్టి సందర్భంగా స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయం కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నిరసన

పెదపూడి: హర్యానా రాష్ట్రంలో ఆశా వర్కర్ల అరెస్టులను ఖండిస్తూ మంగళవారం సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు నిరసన చేపట్టారు. సీఐటీయూ మండల నాయకురాలు ఎం.రాజేశ్వరి మాట్లాడుతూ హర్యానా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఆర్టీసీ గ్యారేజీలో స్వల్ప ప్రమాదం



గోకవరం ఆర్టీసీ డిపో గ్యారేజీలో అదుపు తప్పి గోడను ఢీకొట్టిన బస్సు

గోకవరం: గోకవరం ఆర్టీసీ డిపో గ్యారేజీలో స్వల్ప ప్రమాదం జరిగింది. సోమవారం అర్ధరాత్రి సమయంలో బస్సును రిపేరు చేసే క్రమంలో స్టార్ట్ చేయగా ముందు ఉన్న గోడను ఢీకొట్టింది. దీనిపై ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రామన్నను సంప్రదించగా బస్సును స్టార్ట్ చేసిన సమయంలో అదుపు తప్పి ముందు ఉన్న గోడను ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు.



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో..



గుమ్ములూరులో డ్రాయింగ్ టీచర్ జాకబ్ రాజును సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు



కోరుకొండ సృజన స్కూల్ ఉపాధ్యాయులకు సత్కారం



అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో..



జి.మామిడాడలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్

గురుబ్రహ్మలు.. మార్గదర్శకులు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి

రాజానగరం: అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి, రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులను సత్కరించారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి ఎండీ కె.శశికిరణ్ వర్మ పూలమాల వేసి అంజలి ఘటించారు. సమాజానికి మార్గదర్శకుడు గురువేనన్నారు. క్యాంపస్‌లోని ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న గురువులను సత్కరించారు.

- వెంకటేశ్వరనగర్ పార్కులో జవహర్ వాకర్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. నామవరం భారతీయ విద్యాభవన్‌లోనూ వేడుకలు నిర్వహించారు.
- నన్నయ యూనివర్సిటీలోని సెమినార్ హాల్లో డాక్టర్ సర్వేపల్లి జయంతిని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉపాధ్యాయులందరూ ఆదర్శంగా తీసుకోవాలని రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ ఎస్.ఉదయ భాస్కర్‌ను రాజమహేంద్రవరం ఎస్‌బీ మోటార్స్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బీ మోటార్స్ ఎండీ రామ్‌కుమార్, జీఎం గుప్తా, నాగేంద్ర పాల్గొన్నారు.



నన్నయలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి

సీతానగరంలో..

సీతానగరం: సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం వీరభద్రరావు ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం హెచ్ఎం వీరభద్రరావును ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు కన్నూరి సతీష్‌బాబు, బ్రహ్మాజీ, రాజేష్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలోని అన్ని విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గుమ్ములూరు హైస్కూల్లో డ్రాయింగ్ టీచర్ కేసీహెచ్ జాకబ్‌రాజు, హెచ్ఎం గంగాభవానీలను ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, మాజీ సర్పంచ్ మట్టా పెద్ద వెంకటేశ్వరరావు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించారు. కోరుకొండ సృజన స్కూల్లో కరస్పాండెంట్ షణ్ముఖ.. 30 మంది ఉపాధ్యాయులను సన్మానించారు.



హెచ్ఎం శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ అరుణ్ కుమార్

అనపర్తి మండలంలో..

అనపర్తి: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పలు విద్యాసంస్థల్లో గురుపూజోత్సవం నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలకు చెందిన విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి, ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెదపూడి: విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని లయన్స్ క్లబ్ జిల్లా 316బీ గవర్నర్ వేలూరు సూర్యనారాయణ అన్నారు. జి.మామిడాడ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు పీవీవీఎస్ మాధురి, కేవీ విజయలక్ష్మి, ఎస్.కృష్ణరాధిక, యు.సౌజన్య, పీవీవీఎస్ఎన్ రెడ్డి, డీఎస్‌వీ సుబ్బారావు, ఆర్.లక్ష్మీదేవిని సన్మానించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనివాసు, కార్యదర్శి ద్వారంపూడి యువరాజారెడ్డి, కోశాధికారి డి.వీర్రాఘవరెడ్డి, క్లబ్ మెంటర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి పాల్గొన్నారు.

హెచ్ఎం శ్రీనివాస్‌కు సత్కారం

బిక్కవోలు: విజ్ఞానమనే వెలుగులు నింపే ఉపాధ్యాయులు ఈ సమాజానికి మార్గదర్శకులు అని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పందలపాక బ్రాంచ్ మేనేజర్ బి.అరుణ కుమార్ అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొంకుదురు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉన్నతాధికారులకు విజ్ఞప్తి



రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్‌తో రేషన్ కార్డులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధానిలో మంగళవారం వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులను కలుసుకుని, ఆయా శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులపై చర్చించారు. రేషన్ కార్డు పొందడానికి అర్హత ఉండి, వివిధ కారణాలతో నిలిచిపోయిన వాటిని పునరుద్ధరించాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రేషన్ కార్డుల పైనే అధికంగా విజ్ఞాపనలు వస్తున్న విషయాన్ని ఆయనకు వివరించారు. అలాగే పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి, చీఫ్ ఇంజినీర్ గాయత్రీదేవిని కలుసుకున్న ఎమ్మెల్యే.. వాటర్ గ్రిడ్ పథకం పనులపై చర్చించారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ గోదావరి జలాలను అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ పథకం పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగిరమే పూర్తి చేయించాలన్నారు. అదే విధంగా ఇంటింటికీ కుళాయిల ద్వారా గోదావరి నీటి సరఫరా చేసేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ పథకం పనులు సత్వరమే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



రాజమహేంద్రవరంలో హోంమంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్‌రామ్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న కర్రి వీర్రాఘవరెడ్డి (పందలపాక మెయిన్), పీటర్ పాల్ (పాత వీరంపాలెం), జుత్తుక కామేశ్వరరావు (మెళ్లూరు), పోలిమాటి లక్ష్మణుడు (కూనవరం)

రంగంపేట/బిక్కవోలు/సీతానగరం/రాజానగరం/మధురపూడి: రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు లభించాయి. రాజమహేంద్రవరంలోని రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో మంగళవారం జరిగిన గురుపూజోత్సవంలో వారికి అవార్డుల ప్రదానం చేశారు. హోంమంత్రి తానేటి వనిత, కలెక్టర్ కె.మాధవీలత, ఎంపీ మార్గాని భరత్‌రామ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. అవార్డులు అందుకున్న వారిలో రంగంపేట మండలం దొడ్డిగుంట ఎంపీపీ స్కూల్ (స్పెషల్) ప్రధానోపాధ్యాయుడు వాడ్రేవు శ్రీనివాస్, పాత వీరంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎస్ దుర్గాప్రసాద్, టి.పీటర్ పాల్, బిక్కవోలు మండలం పందలపాక మెయిన్ పాఠశాల ఉపాధ్యాయుడు కర్రి వీర్రాఘవరెడ్డి, మెళ్లూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జుత్తుక కామేశ్వరరావు, సీతానగరం మండలం కూనవరం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన పోలిమాటి లక్ష్మణుడు, వంగలపూడి ఎంపీపీ స్కూల్ చెందిన బొమ్మబోయిన వెంకటేశ్వరరావు, వెదుళ్లపల్లి హైస్కూల్‌కు చెందిన ఎస్.శ్రీనివాస్, రాజానగరం మండలం లాలాచెరువు హెచ్‌బీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పి.సత్యప్రసాద్, కోరుకొండ మండలం కాపవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.విజయ మణి తదితరులు ఉన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- జక్కంపూడి గణేష్
- మిర్తిపాడులో గడప గడపకూ..



మిర్తిపాడులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని మిర్తిపాడులో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమన్నారు. అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు జరుగుతోందన్నారు. గ్రామంలో చాలా చోట్ల సీసీ రోడ్లు వేశామని, మిగిలిన ప్రాంతాల్లో కూడా వేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జగన్ పాలనపై ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంటీటీసీ మాకిరెడ్డి దేవి, పార్టీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సచివాలయ కన్వీనర్ మాకిరెడ్డి సాయి కళ్యాణ్, పార్టీ నాయకులు జొన్నలగడ్డ సత్యనారాయణ, ఏక రాజు, డొక్కా నాగేశ్వరరావు, వాడపల్లి మహేష్, జై భీమ్ యూత్ సభ్యులు, ఉప్పులూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- జక్కంపూడి విజయలక్ష్మి
- డ్వాక్రా మహిళలతో సమావేశం



కణుపూరులో మహిళలతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: మహిళా సాధికారతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం కణుపూరు, రాజవరం గ్రామాల్లోని డ్వాక్రా మహిళలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలను మోసం చేయడానికి చంద్రబాబు మరోసారి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆయన పాలనలో డ్వాక్రా మహిళల కోసం కేవలం రూ.300 కోట్లు విడుదల చేస్తే, జగన్ గడచిన నాలుగేళ్లలో రూ.3 వేల కోట్లు అందించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మహిళలు అండగా నిలబడి, మద్దతు పలకాలన్నారు. సమావేశంలో డ్వాక్రా ఏపీఎం జయంతి రాజ్, కోరుకొండ పీఏసీఎస్ పర్సన్ జాజుల నాగేశ్వరరావు, కణుపూరు సర్పంచ్ కరణం రమణ, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్డి జయలక్ష్మి పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో బుల్లియ్య నాయుడు, నేతుల చిన్ని

మధురపూడి: వైఎస్సార్ సీపీ కోరుకొండ గ్రామ సచివాలయం-1 అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్య నాయుడు, సచివాలయం- 2 అధ్యక్షుడు నేతుల చిన్నిను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అభినందించారు. కోరుకొండలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే రాజా నివాసంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అవగాహన పెంపొందించాలన్నారు.

నల్గొండలో పర్యటన

సీతానగరం: మండలంలోని నల్గొండ గ్రామంలో టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మంగళవారం పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ మేనిఫెస్టోను వివరించారు. కాండ్రు శ్రీనివాస్, చిట్టూరి రంగారావు పాల్గొన్నారు.


ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ఫిజియోథెరపీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: వ్యక్తిగత జీవితంలో ఉండే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భిన్నంగా వృత్తితో కూడిన జీవితం ఉంటుందని జార్ఖండ్‌కు చెందిన విశ్రాంత డీజీపీ, ఎన్‌ఆర్ఐ వైద్య కళాశాల గౌరవ సలహాదారు మండవ విష్ణువర్ధనరావు అన్నారు. స్థానిక జీఎస్ఎల్ ఫిజియోథెరపీ, స్వతంత్ర ఫిజియోథెరపీ కళాశాలల గ్రాడ్యుయేషన్ డే మంగళవారం జరిగింది. విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 42 ఫిజియోథెరపీ కళాశాలలు ఉండగా జీఎస్ఎల్, స్వతంత్ర ఫిజియోథెరపీ కళాశాలలు అగ్రస్థానంలో ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డీన్ డాక్టర్ వైవీ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, సూపరింటిండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి పాల్గొన్నారు.

108 సేవలపై అవగాహన



కోరుకొండలో మాట్లాడుతున్న అరబిందో సంస్థ అధికారులు

మధురపూడి: ఆశా డే సందర్భంగా కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 108 ద్వారా లభించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అరబిందో సంస్థ జోనల్ మేనజర్ గణేష్ మాట్లాడుతూ 108 సేవలను వివరించారు.

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్‌లో అన్ని సదుపాయాలు ఉన్నాయని 108 అంబులెన్స్ ఈఎమ్‌టీ ఎస్.సునీత తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల సమావేశంలో పలు అంశాలపై పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ మేఘన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 108 అంబులెన్స్ డివిజన్ సూపర్‌వైజర్ ఆదిత్యరామ్, పైలట్ ఎస్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సారా తయారు చేస్తున్న ముగ్గురి అరెస్టు



నిందితులతో ఎస్ఈబీ సిబ్బంది

రంగంపేట: సారా తయారు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి మంగళవారం తెలిపారు. జి.దొంతమూరు శివారున పామాయిల్ తోటలో సారా తయారు చేస్తున్నట్టు అందిన సమాచారంతో దాడి చేశామన్నారు. జి.దొంతమూరుకు చెందిన దుప్పలపూడి మార్కండేయులు, రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యికి చెందిన యర్రా శ్రీనును అదుపులోకి తీసుకుని విచారించగా సారా తయారు చేస్తున్నట్టు అంగీకరించారన్నారు. రాజానగరం మండలం శ్రీరాంపురానికి చెందిన కొడేవి నరేష్ సారా తయారీకి బెల్లం సరఫరా చేసినట్టు తెలపగా, నరేష్‌ను కూడా అరెస్టు చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సారా తయారీకి ఉపయోగించిన డ్రమ్ములు, అల్యూమినియం పాత్రలు స్వాధీనం చేసుకుని, 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో దొంతమూరు వీఆర్‌ఓ, వీఆర్ఏ, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్ సమీపంలోని ఎంప్లాయిస్ సంఘ్ ఓపెన్ లైన్ బ్రాంచ్ రాజమహేంద్రవరం కార్యవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఓపెన్ లైన్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి, వారి సమస్యలపై ఆరా తీశామన్నారు. వాటిని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. రైల్వే ఉద్యోగుల సంఘం ఆలిండియా సెక్రటరీ జనరల్ మర్రి రాఘవయ్య ఈ ధర్నాకు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం బ్రాంచ్ సెక్రటరీ సుంకర చంద్రమౌళీ, చెర్మన్ నాగేంద్ర కుమార్, కోశాధికారి కె.సతీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కల్యాణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో సంస్థ సభ్యులు

సీటీఆర్ఐ: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు రూ.4 లక్షల ఉపకార వేతనాలు అందించడం ఆనందంగా ఉందని వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు సత్తిబాబు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలోని ఆనంద్ గార్డెన్స్‌లో విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏడాదికి 50 మంది పేద విద్యార్థులకు రూ.4 లక్షల ఉపకార వేతనాలు అందిస్తూ, వారి ఉన్నతికి సంస్థ తరఫున కృషి చేస్తున్నామన్నారు. ప్రతి నెలా మాదిరిగానే 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పింఛన్లు అందజేశామన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు ఏవీ రమణి, రాళ్లబండి సత్యవాణి, ఆర్‌వీవీ సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, సూరంపూడి తాతారావు, బేరి రత్నం తదితరులు పాల్గొన్నారు.